క్లుప్తంగా

రేపటి నుంచి శ్రీమద్భవద్గీత ప్రవచనాలు

విజయవాడ కల్చరల్: జగద్గురువులు శంకరభాష్య భగవద్గీత అంశంగా ఏడాది పాటు రామకోటిలో నిర్వహించనున్న ప్రవచనాలు 29వ తేది నుంచి ప్రారంభం కానున్నట్లు ధర్మాధికారి శిష్టాల హనుమత్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 నెలల పాటు ప్రతి నెలా మూడు రోజులు ప్రవచనాలు జరుగుతాయని చెప్పారు. శంకరభాష్య భగవద్గీతను ప్రముఖ ఆధ్యాత్మికవేత్తలు అడవికొలను భానుమూర్తి, డాక్టర్ మేడూరి సూర్యనారాయణ శర్మ, డాక్టర్ అంబటిపూడి రాధేశ్యాం, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, డాక్టర్ కుప్పా బిలేశ్వరశర్మ, శిష్టి ప్రసన్నాంజనేయ శర్మ, నందూరి కువల దత్తా, కేవీ శర్మ శౌత్రి, రేమిల్ల వెంకట రామకృష్ణ శాస్త్రి, నారుమంచి అనంతకృష్ణ, డాక్టర్ జమ్ములమడక శ్రీనివాసశాస్త్రి, ప్రవచనం చేస్తారని తెలిపారు. అలాగే ఆగస్టు 3వ తేది సాయంత్రం శివరామకృష్ణ క్షేత్రంలో ప్రవచన బ్రహ్మ మల్లాది చంద్రశేఖర శాస్త్రి శత జయంతి సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): వివాహిత అదృశ్యమైన ఘటనపై నున్న పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నున్న గ్రామానికి చెందిన కొమరవల్లి పరమేశ్వరరావు విశాలాంధ్రలో పని చేస్తాడు. అతని భార్య శశిప్రియ(19) తల్లిదండ్రులతో కలిసి వాటర్ ట్యాంక్ వద్ద ఉంటూ సూరంపల్లి మహిళా ఇండస్ట్రీస్‌లో పనికి వెళుతుంది. ఈనెల 18న రాత్రి ఏడు గంటల సమయంలో బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో పరమేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

నూతన కమిటీ నియామకం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం 23వ డివిజన్ కమిటీని ఆదివారం నియమించారు. 23వ డివిజన్ అధ్యక్షుడిగా ఒగ్గు విక్కీ, గౌరవాధ్యక్షుడిగా దాసరి రమణ, ప్రధాన కార్యదర్శిగా దాసరి శ్రీహర్షసాయి, కార్యదర్శిగా అర్జి అర్జునరావు నియమితులయ్యారు. ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు నూతన కమిటీకి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ అధ్యక్షుడు అత్తలూరి జస్వంత్ కుమార్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

పాయకాపురం(విజయవాడరూరల్): ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆదివారం నున్న పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీసు స్టేషన్ సీఐ పి.కృష్ణమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌లో చోరీ

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం భవానీ బార్ అండ్ రెస్టారెంట్‌లో చోరీ జరిగిన ఘటనపై నున్న పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. 26వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో బార్‌ను క్లోజ్ చేసి క్యాషియర్ పప్పు రవి శేఖర్ ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఆదివారం ఉదయం 9.30గంటల సమయంలో క్లీనింగ్ చేసే వారు వచ్చి చూడగా కౌంటర్ డోర్ పగులగొట్టి క్యాష్ బాక్స్ తెరచి ఉందని క్యాషియర్‌కు ఫోను చేసి చెప్పారు. క్యాషియర్ బార్ వద్దకు వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు బాక్స్‌లో ఉన్న రూ.1.50 లక్షలు చోరీ చేసినట్లు గుర్తించాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శక్తి యాప్‌పై విస్తృత అవగాహన



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన శక్తి బృందాలు నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ శక్తి యాప్‌పై విస్తృత అవగాహన కలిగిస్తున్నారు. మహిళలు, యువతులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు శక్తి బృందాలు వెళ్లి మహిళా చట్టాలు, శక్తియాప్, అత్యవసర సేవల నం.112, సైబర్ మోసాల నివేదికల కోసం 1930, బాలల హెల్ప్‌లైన్ 1098, మహిళ హెల్ప్‌లైన్ 181, ట్రాఫిక్ సమాచారం కోసం 1073, ఫైర్ ఎమర్జెన్సీ 101 వంటి కీలకమైన టోల్ ఫ్రీ నంబర్లపై విస్తృతంగా అవగాహన కలిగిస్తున్నారు. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డీసీపీ కేజీవీ సరిత, మహిళా పోలీస్ స్టేషన్ ఏసీపీ టీ దైవప్రసాద్‌ల పర్యవేక్షణలో శక్తి బృందాలు వివిధ ప్రదేశాల్లో పర్యటిస్తూ అవగాహన కలిగిస్తున్నారు. అంతేకాకుండా మహిళలు, యువతుల మొబైల్ ఫోన్‌లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. సోషల్ మీడియా, సైబర్ నేరాలపై అవగాహన కలిగిస్తున్నారు.

కళావిహీనంగా డివైడర్లు



శోభన్‌బాబు విగ్రహం వద్ద చెత్తచెదారంతో పరిసరాలు



అధ్వానంగా ఉన్న డివైడర్



డివైడర్‌లో ఎండిపోయిన మొక్క

- అధికారుల నిర్లక్ష్యంతో అధ్వానంగా మారిన పరిసరాలు
- సుందరీకరణకు నోచుకోని డివైడర్లు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామంటూ అధికారులు, పాలకులు చేస్తున్న ప్రకటనలు.. ప్రకటనలుగానే మిగిలిపోతున్నాయి. నగరం నడిబొడ్డున ఏలూరు లాకుల సెంటర్ సమీపంలోని శోభన్‌బాబు విగ్రహం సమీపంలోని డివైడర్ పరిసరాలు చెత్తచెదారంతో అపరిశుభ్రంగా మారాయి. ఈ డివైడర్ ప్రాంతాన్ని పట్టించుకునే వారు లేకపోవడంతో యాచకులు ఇక్కడకు చేరుకుని పరిసరాలు పాడుచేస్తున్నారు. డివైడర్ ఫెన్సింగ్‌పై బట్టలు ఆరవేస్తున్నారు. దీంతో ఫెన్సింగ్ పాడవ్వడంతో పాటు తుప్పు పడుతున్నాయి.

పచ్చదనం కరువు

నగర సుందరీకరణలో భాగంగా డివైడర్‌లలో మొక్కలు నాటాలి. అయితే నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామంటూ చెబుతున్న వీఎంసీ అధికారులు ఇక్కడ కనీసం ఒక మొక్కను కూడా నాటిన పాపాన పోలేదు. దీంతో డివైడర్‌లో చెత్తచెదారంతో పాటు పిచ్చి మొక్కలు పెరిగిపోయి పరిసరాలు అధ్వానంగా మారాయి. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ మార్గంలో డివైడర్‌ను సుందరీకరించాలని నగరవాసులు కోరుతున్నారు.

ప్రభుత్వ ముద్రణాలయం సమీపంలో..

ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయం సమీపంలోని డివైడర్‌లో పిచ్చి మొక్కలు బాగా పెరిగిపోతున్నాయి. ఇక్కడ డివైడర్‌ను పట్టించుకునే వారు లేకపోవడంతో పరిసర ప్రాంతాలు కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. అలాగే పాడైన మొక్కలను ఇప్పటి వరకు తొలగించలేదు. వీఎంసీ అధికారులు స్పందించి చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను వేసి డివైడర్‌ను సుందరంగా తీర్చిదిద్దడానికి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మొక్కలు పెంచాలి



నగరానికే తలమానికంగా నిత్యం రద్దీగా ఉండే శోభన్‌బాబు విగ్రహం డివైడర్‌ను అధికారులు చొరవ తీసుకుని సుందరంగా తీర్చిదిద్దాలి. ఈ ప్రాంతంలో మొక్కలు నాటి పరిసరాలను శుభ్రం చేయాలి. పర్యావరణ పరిరక్షణకు కీలకమైన మొక్కలను ఇక్కడ ఎందుకు నాటడం లేదో అర్థం కావడం లేదు.

– డాక్టర్ బీ వసంతకుమార్, బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు

కూటమి మోసాలను ప్రజలకు వివరించండి

వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు



బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పార్టీ నాయకులు

పాయకాపురం(విజయవాడరూరల్): కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని, ఆ మోసాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. ఆదివారం 64వ డివిజన్ సరస్వతి అపార్ట్‌మెంట్ హాలులో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాల కంటే రెట్టింపు పథకాలను ఇస్తామని అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏడాది అయినా కూడా ఎలాంటి పథకాలను అమలు చేయలేదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ క్యాలెండర్‌ను ఇచ్చి మరీ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పథకాలను అందించామని గుర్తు చేశారు. 64వ డివిజన్‌లో ఐదు సంవత్సరాల్లో 15,439 మంది లబ్ధిదారులకు గాను రూ. 51.7 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. కోట్ల రూపాయలతో కండ్రిక - పాతపాడు, జంక్షన్ - రామవరప్పాడు ఇన్నర్‌రింగ్ రోడ్డు, పైపులరోడ్డు - జక్కంపూడి రోడ్లు నిర్మించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అంతేకాక 27వేల పేద కుటుంబాలకు ఇళ్ల రిజిస్ట్రేషన్లు, 12వేల కుటుంబాలకు ఇళ్లస్థలాలను పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు. 2014–19లో టీడీపీ ఎందుకు ఇళ్లపట్టాలు ఎందుకు ఇవ్వలేదని విష్ణు ప్రశ్నించారు.

ఆర్టీసీ ఆస్తులను అమ్మేస్తున్నారు..

కరెంటు బిల్లులు పెంచి పేదలపై మోయలేని భారం వేశారని మల్లాది విష్ణు విమర్శించారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేస్తే రాష్ట్రాన్ని అమ్మాలని మంత్రి అచ్చెంనాయుడు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికే విజయవాడలో ఆర్టీసీ ఆస్తులను, శాతవాహన కాలేజీని అమ్మడాన్ని ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు. బుడమేరు వరదలు సంభవిస్తే అధికారులు ముందస్తు హెచ్చరికలు కూడా ఇవ్వకుండా ప్రజలకు తీవ్ర నష్టం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ పాలనలో రూ. 3.65లక్షల కోట్లు అప్పు చేస్తే, కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే రూ. 2లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా వైఎస్సార్ సీపీ ప్రజల కోసం పని చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యర్రగొర్ల తిరుపతమ్మ, బీహెచ్ఎస్వీ జానారెడ్డి, పార్టీ డివిజన్ కన్వీనర్ షేక్ ఇస్మాయిల్, క్లస్టర్ అధ్యక్షుడు పరిమి నాగేశ్వరరావు, నాయకులు యర్రగొర్ల శ్రీరాములు, అలంపూర్ విజయకుమార్, షేక్ బాజీ, బత్తుల శేఖర్, కొక్కిలిగడ్డ నాని, కిరణ్, సెంట్రల్ నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు మీసాల సత్యనారాయణ, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

62వ డివిజన్‌లో..



62వ డివిజన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మల్లాది విష్ణు, పార్టీ నాయకులు

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 62వ డివిజన్ పైపులరోడ్డు ఫంక్షన్ హాలులో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం కార్పొరేటర్ అలంపూర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ హయాంలో ఐదేళ్లల్లో డివిజన్‌లోని 17,871 మంది లబ్ధిదారులకు నవరత్నాల పథకాల ద్వారా రూ.55.48కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. అనంతరం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కన్వీనర్ వీరబాబు, నాయకులు అలంపూర్ విజయ్‌కుమార్, రామిరెడ్డి, పసుపులేటి యేసు, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్, బోరా బుజ్జి, మహిళా నాయకులు హైమావతి, గ్రేసి, శివపార్వతి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తోపుల వరలక్ష్మి, మహేష్, యోహాను తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జలాభిషేకం









ఏటా శ్రావణమాసంలో ఆనవాయితీ ప్రకారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా నగరంలోని జైనులు కృష్ణానది జలాలు తీసుకెళ్లి గురునానక్ కాలనీలోని శివాలయంలో శివుడికి అభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో జైన మహిళలు, యువతులు దుర్గా ఘాట్‌కు చేరుకొని కావడుల్లో నదీ జలాలు పట్టుకొని ప్రదర్శనగా శివాలయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసం మొదటి వారంలో ఇలా తాము నిర్వహిస్తామని జైనులు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాలు



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించడంతో పాటు ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం చిట్టినగర్ సొరంగం రోడ్డులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి. వెంకట్రావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు ఆంజనేయులు, సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్‌లు, సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయ సత్యబాబులు పాల్గొన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల రాష్ట్ర ప్రజలపై కరెంటు చార్జీలు రెట్టింపు అవుతాయని తెలిపారు. ప్రభుత్వం ఈ విషయం దాచిపెట్టి ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు బిగించిన ఇళ్లకు అధికంగా బిల్లులు వస్తున్నాయనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించడంతో పాటు బిగించిన మీటర్లను సైతం తొలగించాలని కోరారు. మహిళా సంఘాల నాయకులు జి. ఆదిలక్ష్మి, పి. దుర్గాంబ, ఇతర అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మహిషాసురమర్దిని నృత్యం



నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలోని కళావేదికపై చెన్నైకు చెందిన మధుర కళానికేతన్‌కు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన మీనాక్షి – మహిషాసురమర్దిని నృత్య రూపకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై ఆదివారం సాయంత్రం డాక్టర్ మల్లంపల్లి మాధవి పర్యవేక్షణలో చెన్నైకు చెందిన కళాకారులు గురు, రోజారాణి, దుర్గా, నటరాజ్ బృందం మహిషాసురమర్దిని నృత్య రూపకాన్ని ఆకట్టుకునే రీతిలో ప్రదర్శించారు. కళాకారులు ప్రదర్శించిన నృత్య రూపకాన్ని భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించి కళాకారులను అభినందించారు. అనంతరం కళాకారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో పురోగతి

ఎస్ఎన్‌పురం సీఐ లక్ష్మీనారాయణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఈ ఏడాదిలో ఇప్పటి వరకు సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వరుస ద్విచక్రవాహనాల చోరీ కేసుల్లో పురోగతి సాధించినట్లు సీఐ ఎస్వీవీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. జనవరి నుంచి ఇప్పటి వరకు 39 ద్విచక్ర వాహనాలు చోరీ అయినట్లు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ద్విచక్రవాహనాల దొంగలపై ప్రత్యేక దృష్టి సారించి 22 కేసుల్లో 15 మంది నిందితులను అరెస్టు చేశామని చెప్పారు. వారి నుంచి 32 బైక్‌లను రికవరీ చేయడం జరిగిందన్నారు. ఎస్ఎన్‌పురం పీఎస్ పరిధిలోని గాంధీనగర్, సాంబమూర్తి రోడ్డు, బీఆర్టీఎస్ రోడ్డు, గవర్నమెంట్ ప్రెస్, అంబేడ్కర్ కాలనీ, బావాజీ పేట, శ్రీనగర్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, ముత్యాలంపాడు, పసుపుతోట తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు, చోరీలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి



కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గౌతంరెడ్డి



కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాగుల్ మీరా

మధురానగర్(విజయవాడ సెంట్రల్): శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఏపీజే అబ్దుల్ కలాం చేసిన సేవలు మరువలేనివని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సత్యనారాయణపురం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గౌతంరెడ్డి మాట్లాడుతూ యువత కలాం జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర, నాయకులు బల్లం కిషోర్, కేఆర్ వర్మ, పురుషోత్తం, దుర్గాప్రసాద్, ప్రసాద్, కోటి, కృష్ణ, రమేష్, అనిల్, నాగరాజు, శివాజీ, శంకరరెడ్డి, మల్లేశ్వరరావు, అజరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) రాష్ట్ర కార్యాలయం వద్ద అబ్దుల్ కలాం వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా కలాం చిత్ర పటానికి నివాళులర్పించారు. ఏఎంసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా సాజిద్ అలీ, కమిటీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సయ్యద్ మౌలాలి, నగర అధ్యక్షుడు సిలార్ బేగ్, నగర మహిళా ప్రధాన కార్యదర్శి గుల్‌నాజ్ బేగం, షేక్ సోహేబ్ పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



మాట్లాడుతున్న డేవిడ్‌రాజు, చిట్టిబాబు తదితరులు

విజయవాడ కల్చరల్: కళాకారులను గుర్తించి ప్రోత్సహించాలని విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్ రాజు అన్నారు. సురభి ఫౌండేషన్ దివ్యాంగుల సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై దివ్యాంగుల సినీ సంగీత విభావరిని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు సేవలను అందిస్తున్న సురభి సంస్థను అభినందించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కళాకారులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని కోరారు. అనంతరం ఆ పాత మధురాలు పేరుతో గాయనీ గాయకులు సినీ గీతాలను ఆలపించారు. విశ్రాంత ఐటీసీ అధికారి బీవీ వీరభద్రరావు, వాఖ్యాత కొప్పుల ఆనంద్, సురభి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కామినేని ఉమాశంకర్ పాల్గొన్నారు.

కవి సమ్మేళనాలను ప్రోత్సహించాలి



కవిని సత్కరిస్తున్న గోళ్ల నారాయణరావు, పొట్లూరి హరికృష్ణ

విజయవాడ కల్చరల్: కవులను, కవి సమ్మేళనాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని క్రామేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు పేర్కొన్నారు. ఆర్ట్స్ ఫౌండేషన్, ఏపీ భాషా సాంస్కృతిక సమితి సౌజన్యంతో గవర్నర్‌పేటలోని విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం అమరావతి ఇతివృత్తంగా కవి సమ్మేళనం నిర్వహించారు. గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ కవులు సమాజంలో వస్తున్న మార్పులను అన్వేషిస్తారన్నారు. కవి క్రాంతి దర్శిని అని భవిష్యత్‌ను తన కవిత్వంలో వినిపిస్తాడని అన్నారు. కవిత్వంలో పునరుక్తులు, పునశ్చరణలు లేకుండా చూడాలని చెప్పారు. ప్రభుత్వం, సాంస్కృతిక సంస్థలు కవి సమ్మేళనాలు, సాహిత్య సభలను ప్రోత్సహించాలని సూచించారు. ఆర్ట్స్ ఫౌండేస్ వ్యవస్థాపకుడు పొట్లూరి హరికృష్ణ మాట్లాడుతూ కవులు, రచయితలు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక సాహిత్య సభలను నిర్వహిస్తున్నామని కవులను భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు అమరావతి అంశంగా స్వీయ కవితా గానం చేశారు. నిర్వాహకులు కవులకు జ్ఞాపికలను, ప్రశంసాపత్రాలను అందజేశారు.

చెరువుల్లో చేపల సాగుహక్కులకు వేలం నిర్వహించాలి

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో చేపల చెరువులకు వేలం నిర్వహించాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. బూరుగుల చెరువు, జంగమవాని చెరువుల్లో చేపల సాగు హక్కులకు గడువు జూన్ నెలాఖరుతో ముగిసినందున గ్రామ పంచాయతీ ఈ ఏడాది చేపల చెరువులకు వేలం నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గత రెండు దఫాలుగా చేపల చెరువుల వేలం డబ్బులు ఎవరి వద్ద ఉన్నాయో గ్రామ ప్రజలకు తెలియజేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): రాయల్ క్లబ్ అమరావతి ఆధ్వర్యంలో ఆదివారం రామలింగేశ్వరనగర్‌లోని వినోద్ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంపునకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైద్యులు రవితేజ, విశ్వనాథ్ కార్తిక్, యోగిత, గంగాధర్ ఆధ్వర్యంలో 200 మంది రోగులను పరిక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు బి. రామ్మోహనరావు చెప్పారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ రాయల్‌క్లబ్ గత కొన్ని ఏళ్ల నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.అనిల్‌కుమార్, కోశాధికారి కె. శివనారాయణ పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎలాంటి నేరాలకు పాల్పడకుండా, నేర ప్రవృత్తిని మాని, మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని ఎన్టీఆర్ జిల్లాలోని రౌడీ షీటర్‌లు, సస్పెక్ట్‌లకు పోలీసు అధికారులు సూచించారు. జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లు, టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలలో ఆదివారం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా మంచి మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలను దూరంగా ఉండాలని సూచించారు.